



నగరి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు

మృతదేహాలు



పార్థసారథి నాయుడు - రాజేంద్రనాయుడు - ధనుష్కోటి - కుమార్

రక్తమోడిన రహదారి



- ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రైవేటు బస్సును ఢీకొట్టిన లారీ
- నలుగురి దుర్మరణం
- 13 మందికి తీవ్రగాయాలు
- వీరిలో ఒకరి పరిస్థితి విషమం
- రాత్రి 9 గంటలకు ప్రమాదం



ఓవైపు సగభాగం దెబ్బతిన్న బస్సు

నగరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణం సాయిబాబా గుడి సమీపంలోని తిరుపతి- చెన్నై జాతీయ రహదారి ఆదివారం రాత్రి 9 గంటలకు రక్తమోడింది. తమిళనాడుకు చెందిన ఓ ప్రైవేటు బస్సు ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో ఎదురుగా ఓ లారీ ఢీకొట్టుకుంటూ వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బస్సుకు ఒకపక్క సగభాగం వరకు ధ్వంసమైంది. గాయపడ్డ ప్రయాణికుల హాహాకారాలతోపాటు రోడ్డంతా రక్తసిక్తమైంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కొంతసేపు నిశ్చేష్టులయ్యారు. ఆ తర్వాత తేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులను స్థానికులు, పోలీసులు, 108 వాహన సిబ్బంది కలిసి నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. డ్యూటీలోని సిబ్బంది కాకుండా వైద్యులు, ఇతర సిబ్బంది హుటాహుటిన వచ్చి బాధితులకు చికిత్స ప్రారంభించారు. ఆస్పత్రి రోదనలతో నిండిపోయింది. నగరి డీఎస్పీ అజీజ్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

మృతులు: తిరుత్తణికి చెందిన కుమార్(60), తిరువళ్లూరుకు చెందిన ధనుష్కోటి(12), వడమాలపేట మండలంలోని సీతారామాపురానికి చెందిన పార్థసారథి నాయుడు (62), రాజేంద్రనాయుడు (60).

గాయపడినవారు: రాధాకృష్ణ(తాడిపత్రి),సెల్వి(తిరుపతి),వెట్రివేల్(తిరువళ్లూరు),భరత్ (తిరుపతి), మురళి (ఊత్తుకోట), రుద్రమూర్తి (తిరువళ్లూరు),సుబ్బరత్నమ్మ (తాడిపత్రి), సుధాకర్(తిరువళ్లూరు), చిన్నామలై(తిరువళ్లూరు),నాగేంద్ర(తాడిపత్రి), ఆయన తల్లి,అనూరాధ దంపతులు (శివగిరి). పరిస్థితి విషమంగా ఉన్న చిన్నామలైని తిరుపతికి తరలించారు.

తిరుత్తణిలో పెళ్లికి వెళ్లొస్తూ..

- 'నగరి' ప్రమాద మృతుల్లో ఇద్దరిది సీతారామపురం



పార్థసారథినాయుడు - రాజేంద్రనాయుడు

ఆదివారం ఉదయం.. గ్రామస్తులతో కలిసి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను పార్థసారథి నాయుడు(62), రాజేంద్ర నాయుడు(60) కలిశారు. అమరావతి అభివృద్ధికి తమ గ్రామం తరఫున రూ.50 వేలు అందజేశారు. సాయంత్రం ఇద్దరూ కలిసి తిరుత్తణిలో పెళ్లికి వెళ్లారు. తిరిగొచ్చే క్రమంలో నగరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సులోని ఈ ఇద్దరు టీడీపీ నేతలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ ఇద్దరూ సమీప బంధువులు. వీరి మృతి సమాచారంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పార్థసారథి నాయుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉన్నాడు. రాజేంద్రకు ఓ కుమార్తె ఉంది. వీరిద్దరూ వ్యవసాయదారులే. వీరి మృతి పట్ల ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సంతాపం తెలియజేశారు. వీరి కుటుంబాలకు అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్యేకు చెక్కు అందిస్తున్న టీడీపీ నాయకులతో పార్థసారథి నాయుడు, రాజేంద్రనాయుడు (సర్కిల్‌లోని వ్యక్తులు)

స్వర్ణ పంచాయత్

- త్వరలోనే అందుబాటులోకి రానున్న వెబ్‌సైట్
- ఆపై గ్రామాల్లో సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే..
- పారదర్శకతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీల వ్యవస్థను నిర్వీర్యం చేసింది. సర్పంచ్ పదవులకు విలువ లేకుండా చేసి, అభివృద్ధి పనులను అటకెక్కించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు పెద్దపీట వేసింది. ఇపుడు పారదర్శకంగా సేవలు అందించడంలో భాగంగా స్వర్ణపంచాయత్ వెబ్‌సైట్‌ను రూపొందించింది.

- గంగాధరనెల్లూరు, ఆంధ్రజ్యోతి



పాతపాళ్యం పంచాయతీ కార్యాలయ భవనం

స్వర్ణపంచాయత్ (https://swarnapanchayat.apcfss.in/) వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తే అక్రమాలకు చెక్ పడనుంది. గతంలో పలు గ్రామాల్లో ప్రజల నుంచి వసూలైన పన్నులు దుర్వినియోగం జరిగిందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చేది. దీనిపై విచారించడం పరిపాటిగా మారింది. వీటన్నింటికీ ఈ వెబ్‌సైట్‌తో అడ్డుకట్ట పడుతుందని అధికారులు చెబుతున్నారు.


లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో..

పంచాయతీల్లో ఎటువంటి లావాదేవీలైనా ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిపైసాకు లెక్క ఉంటుంది. పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో గృహాల పన్నులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అసెస్‌మెంట్ల వారీగా వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. డిమాండ్ ప్రకారం నగదును ఫోన్ పే, పేటీఎం, నెట్ బ్యాంకింగ్ ద్వారా గ్రామీణ ప్రజలు పన్నులు చెల్లించవచ్చు. త్వరలోనే దీనికి సంబంధించిన యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. రాబోవు రోజుల్లో పంచాయతీరాజ్‌లో టెక్నాలజీని విరివిగా ఉపయోగించనున్నారు.

జియో మ్యాపింగ్ చేసి ఉండడం వల్ల మార్కెట్‌ను బట్టి ఆటోమేటిక్గా పన్ను డిమాండ్‌ను ఫిక్స్ చేస్తుంది. మొత్తం మీద ప్రస్తుతం విద్యుత్ బిల్లు తరహాలో పన్నులు చెల్లించేలా ఈ వ్యవస్థ పనిచేస్తుంది.

వెబ్‌సైట్‌లో ఉండే వివరాలు

వెబ్‌సైట్‌లో మొదటగా పంచాయతీ ముఖచిత్రం ఉంటుంది. ఆ పంచాయతీలోని ప్రతి ఇంటి విస్తీర్ణం, హద్దులు, యాజమాని వివరాలు, ఏడాదికి ఎంతపన్ను చెల్లిస్తున్నారు, ఆస్తి వ్యాపార సముదాయాలకు సంబంధించి పన్నులు, చెరువులు, స్థలాలు, లీజు, సెల్ టవర్లు, పరిశ్రమలు, రోజువారీ వ్యాపారాలనుంచి చేస్తున్న వసూళ్లు.. ఇలా పంచాయతీలకు ఆదాయం వచ్చే అన్ని వివరాలు ఉంటాయి.



సేవలన్నీ ఆన్‌లైన్‌లో పొందవచ్చు



స్వర్ణపంచాయతీ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చాక సేవలన్నీ ఆన్‌లైన్‌లో పొందవచ్చు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, అనుమతులు ఆన్‌లైన్ ద్వారా తీసుకోవచ్చు. ఇంటిపన్ను, ఇతరత్రా రుసుంను కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చు. పన్నులు రూపంలో వసూలయ్యే నగదు దుర్వినియోగం కాకుండా, ప్రజలకు పారదర్శకంగా చూపించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశం. పైగా పంచాయతీల పురోభివృద్ధికి ఈ వెబ్‌సైట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. త్వరలోనే ప్రజలకు అందుబాటులో రానుంది.

- మారం హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో, గంగాధరనెల్లూరు మండలం

4 లేన్‌గా పలమనేరు - కుప్పం రోడ్డు

- రూ.1,500 కోట్లతో రహదారి అభివృద్ధికి ప్రణాళిక
- డీపీఆర్ తయారీలో యంత్రాంగం
- మూడు చోట్ల కొత్త బైపాస్‌లు

పలమనేరు- కుప్పం హైవే రెండు నుంచి నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చెందనుంది. సీఎం అయ్యాక గత ఏడాది జూలైలో తొలిసారి కుప్పంలో పర్యటించిన చంద్రబాబు ఈ రహదారి అభివృద్ధి విషయాన్ని ప్రకటించారు. ప్రస్తుతం అధికారులు డీపీఆర్‌ను తయారు చేస్తున్నారు. అనుగుణంగా సర్వే కూడా జరుగుతోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

చంద్రబాబు సీఎంగా ఉన్న ప్రతిసారీ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనూ జిల్లాలో అనేక జాతీయ, రాష్ట్ర రహదారులు అభివృద్ధి చెందాయి. చిత్తూరు-తిరుపతి, తిరుపతి- నాయుడుపేట ఆరు వరుసలు, తిరుపతి-మదనపల్లె, పూతలపట్టు- పీలేరు, చిత్తూరు- పలమనేరు.. ఇలా అనేక రహదారులు అభివృద్ధి చెందాయి. వీటితోపాటు అప్పట్లో కొత్తగా ఏడు ఆర్వోబీలనూ నిర్మించారు. వైసీపీ ఐదేళ్లపాటు రహదారులను పట్టించుకోని విషయం తెలిసిందే.

మళ్లీ రహదారుల అభివృద్ధిపై దృష్టి

తాజాగా కూటమి ప్రభుత్వం మళ్లీ రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఇప్పటికే రూ.22 కోట్లతో రహదారుల మరమ్మతులు చేస్తుండగా.. 70శాతం పనులు పూర్తయ్యాయి. రూ.99 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేస్తుండగా.. అవి కూడా పురోగతిలో ఉన్నాయి. మరోవైపు చిత్తూరు- తచ్చూరు, చెన్నై- బెంగళూరు జాతీయ రహదారుల నిర్మాణ పనులూ వేగంగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఒకటి, వచ్చే ఏడాది మరోటి అందుబాటులోకి రానున్నాయి. ఇప్పుడు తాజాగా, పలమనేరు నుంచి కుప్పం మీదుగా తమిళనాడు సరిహద్దు వరకు నేషనల్ హైవే(ఎన్‌హెచ్ 42)ను అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధమైంది.



వి.కోట వద్ద పలమనేరు- కుప్పం రోడ్డు

84 కిలోమీటర్లు.. రూ.1,500 కోట్లు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే చిత్తూరు సమీప తమిళనాడు సరిహద్దు నుంచి గంగవరం సమీప కర్ణాటక సరిహద్దు వరకు జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేశారు. పలమనేరు నుంచి కుప్పం వరకు రెండు వరుసలుగా అలాగే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు జూలైలో కుప్పంలో పర్యటించినప్పుడు పలమనేరు- కుప్పం రోడ్డును నాలుగు వరుసలుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కుప్పం నుంచి తమిళనాడు సరిహద్దు వరకు మరో 20 కిలోమీటర్ల వరకు సాగే ఈ రహదారిని మొత్తంగా 84 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నారు. భూసేకరణతో కలిపి రూ.1,500 కోట్ల అంచనా వ్యయం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. డీపీఆర్ పూర్తయ్యాక ఎంత అవుతుందనేది కచ్చితంగా తెలుస్తుంది.



శాంతిపురం మండలం చెల్దిగానిపల్లె వద్ద సర్వే చేస్తున్న సిబ్బంది

శాంతిపురం, రాజుపేట, కుప్పంలకు బైపాస్‌లు

పలమనేరు - కుప్పం రహదారి అభివృద్ధిలో మూడు చోట్ల బైపాస్‌లను నిర్మించనున్నారు. శాంతిపురం, రాజుపేట, కుప్పం ప్రాంతాల్లో బైపాస్ రోడ్లను నిర్మించనుండగా.. బైరెడ్డిపల్లె, వి.కోట ప్రాంతాల్లో బైపాస్ నిర్మాణానికి ఇదివరకే పనులు మంజూరయ్యాయి. ఈ రెండు ప్రాంతాల్లో భూసేకరణతోపాటు తొమ్మిది కిలోమీటర్ల బైపాస్ నిర్మాణానికి రూ.వంద కోట్లను కేటాయించారు. బైరెడ్డిపల్లెలో భూసేకరణ పూర్తవ్వగా, వి.కోటలో పెండింగులో ఉంది. కాగా, అప్పట్లో ఈ పనులకు జేఎంసీ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. అధికారులు భూసేకరణ పూర్తి చేస్తే ఆ సంస్థ పనుల్ని ప్రారంభిస్తుంది.

వి.కోట బైపాస్ మార్పు కోసం స్థానికుల పోరాటం

బైరెడ్డిపల్లె, వి.కోట ప్రాంతాల్లో బైపాస్ నిర్మాణానికి గతంలోనే రూ.వంద కోట్లతో పనులు మంజూర్వగా.. వి.కోటలో బైపాస్ మార్పు కోసం స్థానికులు పోరాటం చేస్తున్నారు. బైపాస్ వి.కోటకు పడమర వైపున వెళ్లనుంది. ఇది కర్ణాటక రాష్ట్ర పరిధిలోకి వస్తుంది. కానీ, స్థానికులు పట్టణానికి తూర్పు వైపున బైపాస్ కావాలని పోరాడుతున్నారు. ప్రస్తుతమున్న డిజైన్ మేరకు వి.కోటలో బైపాస్ నిర్మించాలంటే కర్ణాటక రాష్ట్రం వాళ్లు కూడా భూసేకరణ చేయాల్సి ఉంది. తూర్పు వైపునకు మార్చితే మన రాష్ట్రంలో నుంచే రోడ్డు వెళ్తుంది. దీంతో స్థానికులు వి.కోట బైపాస్ డిజైన్‌ను మార్చాలని సుమారు ఏడువేల మంది సంతకాలు చేసి.. అన్ని స్థాయిల్లో ప్రజాప్రతినిధులకు అందించారు. అలాగే నిర్వాసితులతో కలిసి హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. దీంతో ఇక్కడ పనులు తాత్కాలికంగా ఆగాయి.

'కూటమి' ప్రభుత్వానికి సంక్షేమమే ముఖ్యం

- పుంగనూరులో మార్మోగుతున్న పెద్దిరెడ్డి దౌర్జన్యాలు, దోపిడీలు
- జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న నాగబాబు

తొలి సభ సక్సెస్

జనంలోకి జనసేన పేరుతో జిల్లాలో నిర్వహించిన తొలి బహిరంగ సక్సెస్ అయ్యింది. ప్రధానంగా పెద్దిరెడ్డిపై నాగబాబు తీవ్రస్థాయిలో గళం విప్పడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది.

సోమల/పుంగనూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి పగకంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు అన్నారు. అందుకే ఎనిమిది నెలల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్రమోదీ అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టారన్నారు. సోమలలో ఆదివారం జరిగిన 'జనంలోకి జనసేన' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకు కేవలం రూ.250 పింఛను పెంచడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. అదే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులు, వితంతువుల పింఛనును రూ.4వేలకు, దివ్యాంగులకు రెట్టింపు పెంచిందని గుర్తుచేశారు. 64 లక్షల మందికి రూ.20537 కోట్లను ఒకటో తేదీనే ఇస్తూ దేశంలోనే రికార్డు సాధించిందని చెప్పారు. అమరావతి, పోలవరానికి నిధులు, 80 లక్షల మందికి దీపం, వంటగ్యాస్, రూ.361కోట్లు రోడ్ల రిపేరుకు, 16,347 మంది ఉపాధ్యాయులకు మెగా డీఎస్సీ, 6100 మంది పోలీసు ఉద్యోగాలకు ప్రభుత్వం చర్య తీసుకుందన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్టు.. చెత్తపన్ను రద్దు చేసిందని, ప్రజలకు ఉచిత ఇసుక ఇవ్వడంతోపాటూ 20 ప్రముఖ కంపెనీలు, రాష్ట్రంలో రూ.6.33 లక్షల కోట్లు ఖర్చు చేసి 4లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చారన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీ తీర్మానం చేసిందని గుర్తుచేశారు. విశాఖ రైల్వే జోన్‌కు 52 ఎకరాల స్థల సేకరణ, ఉక్కు పరిశ్రమ పునరుద్ధరణకు రూ.11440 కోట్ల కేటాయింపు, విశాఖ సీసీఎస్‌లో 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు, 119 అన్నా క్యాంటీన్ల ప్రారంభం తదితర అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అంటేనే అరాచకానికి మారు పేరని విమర్శించారు. ఆయన దౌర్జన్యాలు, దోపిడీలు పుంగనూరు నియోజకవర్గంలో మార్మోగుతున్నాయని నాగబాబు మండిపడ్డారు. అందువల్లే ఎమ్మెల్యేగా గెలిచినా ఆయన నియోజకవర్గంలోకి ధైర్యంగా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఈ సమావేశంలో టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నాయకులు హరిప్రసాద్, కిరణ్‌రాయల్, వేణుగోపాల్‌రెడ్డి, పగడాల రమణ, సుభాషిణి, రాందాస్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి దర్శనానికి 4 గంటలు



ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయానికి తరలిరావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. స్వామి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తుల మధ్య ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

ఫీజుపోరుతో వైసీపీ మరో నాటకం

● టీఎన్ఎస్ఎఫ్

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఫీజుపోరుతో వైసీపీ మరో నాటకానికి తెర తీస్తోందని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు వి.త్యాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 5న వైఎస్సార్‌సీపీ ఫీజు పేరుతో ధర్నా చేస్తామని పోస్టర్ విడుదల చేశారన్నారు. విద్యార్థులను ఫీజు కోసం లీగల్ నోటీసులు అందుకునేలా చేసిన వైసీపీ ఇప్పుడు ధర్నా ఎలా చేస్తుందని ప్రశ్నించారు. 2014-19 టీడీపీ పాలనలో ఏటా 16 లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తే, జగన్‌రెడ్డి పాలనలో కేవలం 9 లక్షల మందికి.. అది కూడా విడతల వారీగా ఇచ్చి, దాదాపు 7 లక్షల మంది పేద విద్యార్థులను మోసం చేశారన్నారు. ఐదేళ్లలో 4 విడతలు ఎగ్గొట్టి కేవలం ఫీజులకే రూ.4277 కోట్లు బకాయిలు మిగిల్చిన వైసీపీ ప్రభుత్వం నేడు ఫీజుపోరు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం రూ.788 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిందని చెప్పారు. రాష్ట్రంలో విద్యార్థులు జగన్‌రెడ్డిని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

తిరుమల శ్రీవారికి 14 టన్నుల కూరగాయల వితరణ



లారీకి పూజలు చేసిన రవీంద్రరెడ్డి, మండీ యజమానులు

పలమనేరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని వడ్డిపల్లె కూరగాయల మార్కెట్ నుంచి 14 టన్నుల కూరగాయలను ఆదివారం తిరుమల తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రానికి పంపారు. పలమనేరుకు చెందిన శ్రీవారి భక్తుడు కాప్పల్లి రవీంద్రరెడ్డి అభ్యర్థన మేరకు వడ్డిపల్లె మార్కెట్‌లోని మండీ యజమానులు రథసప్తమి సందర్భంగా కూరగాయలను సేకరించారు. టీటీడీ వాహనంలోకి లోడ్డు చేసి పూజలు చేసిన అనంతరం తిరుమలకు తరలించారు. కార్యక్రమంలో వడ్డిపల్లి మండీ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లి సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్ఈ



కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

గుడిపాల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం చిత్తూరు - వేలూరు మార్గంలో నూతనంగా రోడ్డు వేస్తున్న సందర్భంగా జరుగుతున్న విద్యుత్ లైన్ల మార్పిడి పనులను ఆయన పరిశీలించి, సూచనలు చేశారు. సబ్‌స్టేషన్‌లో పని చేసే షిఫ్ట్ ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యుత్‌కు అంతరాయం కలగకుండా సరఫరా అందించాలన్నారు. ఆయన వెంట చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర, డీఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో అక్షరాభ్యాసాలు



ఆస్థాన మండపంలో చిన్నారులతో ఓనమాలు దిద్దిస్తున్న తల్లిదండ్రులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఆదివారం శ్రీపంచమి(వసంత పంచమి)ని పురస్కరించుకుని అధిక సంఖ్యలో అక్షరాభ్యాసాలను చిన్నారుల తల్లిదండ్రులు నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో సుమారు 250 మంది తల్లిదండ్రులు చిన్నారుల చేత ఓనమాలు దిద్దించారు. ప్రతి ఏటా శ్రీపంచమిని పురస్కరించుకుని వందలాదిగా చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

నేడు 'పీజీఆర్ఎస్'

చితూరు అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆయా మండల, నియోజకవర్గాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

నేడు మిగిలిన 9వేల మందికి పింఛన్ల పంపిణీ

● డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి


చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా ఫిబ్రవరి కోటా కింద జిల్లాలోని 2,65,698 మందికి గాను శనివారం 2,22,733 మందికి పంపిణీచేసి రాష్ట్రంలో చిత్తూరు జిల్లా మూడో స్థానంలో నిలిచినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి తెలిపారు. మిగిలిన 9965 మందికి సోమవారం అందజేస్తామని, పింఛన్ దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్నేక్ స్నాచర్ దుర్మరణం

చిత్తూర్ అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో అటవీశాఖ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి (పాములు పట్టే)గా పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్ దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు నగరంలోని జానకారపల్లెకి చెందిన ప్రేమ్‌కుమార్ ఆదివారం రాత్రి బైక్‌పై కట్టమంచి నుంచి నగరంవైపు బయల్దేరాడు. ఈ క్రమంలో ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తి వస్తున్నాడు. ఇద్దరి వాహనాలూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రేమ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.



ప్రేమ్‌కుమార్ (ఫైల్ ఫోటో)







నవ వసంతం

ఆకులన్నీ రాలిన చోటే కొత్త చిగురు కనిపిస్తుంది అంటారు సినీకవి చంద్రబోస్ ఓపాటలో.. చిత్తూరు-కాణిపాకం రోడ్డులోని అత్తిచెట్టును చూస్తే ఈ మాటలు అతికినట్టు సరిపోతాయి. పచ్చని ఆకులతో డిసెంబరు వరకూ ఆహ్లాదాన్ని పంచింది. తర్వాత ఆకులన్నీ రాలి చెట్టు కళావిహీనమైంది. అయితే కొద్దిరోజులకే ప్రతికొమ్మకూ కాయలు కాసింది. ప్రత్యేక అందాన్ని సంతరించుకుంది. చూపరుల దృష్టిని ఆకర్షిస్తోంది.

జంట ఏనుగుల హల్‌చల్

భయాందోళనలో కీలపట్ల కురపల్లెవాసులు

గంగవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలంలోని కీలపట్ల కురపల్లె గ్రామ సమీపంలో జంట ఏనుగులు హల్‌చల్ చేయడంతో గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కుక్కలు అరుస్తుండటంతోపాటు ఏనుగులు చేస్తున్న శబ్దాలతో గ్రామస్తులు ఉలిక్కిపడి ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చారు. పక్కనే ఉన్న మామిడితోటలోకి జంట ఏనుగులు చేరుకుని చెట్లను ధ్వంసం చేశాయి. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో గ్రామానికి చేరుకున్నవారు టపాకాయలు పేలుస్తూ డప్పుల శబ్దాలతో ఏనుగులను సమీపంలోని అడవిలోకి మళ్లించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



అడవివైపు వెళుతున్న ఏనుగు

గుడిపాల, పులిచెర్ల మండలాల్లో పొలాలపై ఒంటరి ఏనుగు దాడి



గుడిపాల మండలంలో ఏనుగు తొక్కేసిన రాగి పంట

గుడిపాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలపై ఆదివారం తెల్లవారు జామున ఒంటరి ఏనుగు సంచరిస్తూ గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేసింది. గుడిపాల మండలంలోని పానాటూరు, చిత్తపార తదితర ప్రాంతాల్లో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేస్తూ రైతుల వరి పంటకు నష్టం కలిగించడంతో వెంటనే ఫారెస్టు అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఫారెస్టు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, ఒంటరి ఏనుగును

ధ్వంసమైన పంటలు

అడవిలోకి తరలించి పట్టుకునే ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనంద్ రెడ్డి, ఫారెస్ట్ ఇన్‌చార్జి బీట్ అధికారిణి ఢిల్లీరాణి తమ సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించి ప్రజలెవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని, ఏనుగును పట్టుకునే ప్రయత్నంలో ఉన్నామన్నారు.

పులిచెర్లలో ఇలా..

కల్లూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం రాత్రి ఒంటరి ఏనుగు దాడులతో వరి, కొబ్బరి, మామిడి, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. తిరుపతి జిల్లా భాకరాపేట చెక్‌పోస్టు సమీపం నుంచి బయల్దేరిన ఒంటరి ఏనుగు.. పులిచెర్ల మండలంలోని మూలమడుగు వద్దకు చేరుకొంది. మంగళంపేటకు చెందిన ఆంజనేయులు పొలం వద్ద ఏర్పాటుచేసిన వ్యవసాయ విద్యుత్ స్టార్టర్‌ను ధ్వంసం చేసి ఇదే రైతుకు చెందిన వరిపంటను తొక్కేసింది. అనంతరం గడ్డంవారిపల్లెలోని మహబూబ్‌బాషాకు చెందిన 3 కొబ్బరి చెట్లు, 3 మామిడిచెట్లను విరిచేసింది. అలాగే ఎల్లంకివారిపల్లె పంచాయతీ దిగుమూర్తివారిపల్లె వద్దకు చేరుకున్న ఏనుగు కౌలు రైతు జయచంద్రనాయుడికి చెందిన వరి పంట, రైతు సురేంద్రకు చెందిన వరిపంటను ధ్వంసం చేసింది. మరోరైతు గోపీనాథనాయుడికి చెందిన మామిడిచెట్లను విరిచేసింది. అనంతరం గుండాలమ్మగుడి మీదుగా భీమవరం అటవీప్రాంతం చీటీగలకోన వైపు వెళ్లినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ తెలిపారు.



పులిచెర్ల మండలంలో ఏనుగు దాడిలో ధ్వంసమైన వరి పంట

బాలాలయ స్వామికి ఘనంగా ఛాయాధివాసం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో ప్రధాన ఆవరణంలోని వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద బాలాలయ స్వామికి ఛాయాధివాసంను ఆదివారం అర్చక, పండితులు ఘనంగా నిర్వహించారు. బాలాలయ పూజల్లో భాగంగా ఉదయం విష్వక్సేన ఆరాధన, మూలమూర్తికి నవకలశ స్నపనం, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ హోమం, పుణ్యాహ ప్రోక్షణం, పంచగవ్య ప్రోక్షణ, పర్యగ్నికరణం, హనుమంతు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం బాలాలయ స్వామికి రక్షాబంధనం, నేత్రోన్మీలనం, శయనాధివాసం, యాగశాల ఆరాధన, ఆజ్ఞారాధన, రామమంత్ర జపం, హనుమత్ హవనం, తత్వాన్యాస హోమం, ప్రాణ ప్రతిష్ఠ హవనం, ప్రాణాది దశ వాయున్యాస హోమం, సంపాదాజ్యస్పర్శన, సృష్టికృత్ హవనం, ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి,బాలాజీనాయుడుపాల్గొన్నారు.



యాగశాలలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సోలార్ ఫెన్సింగ్ కట్ చేసి.. గోడ దూకి తిరుపతిలో రెచ్చిపోయిన దొంగలు

● రెండు విల్లాల్లో 720 గ్రాముల బంగారం, రూ.4.50 లక్షల నగదు, 1.650 కిలోల వెండి అపహరణ





సీసీ కెమెరాల్లో రికార్డయిన దొంగలు, ఇంట్లో చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం వద్దనున్న సీపీఆర్ విల్లాస్‌లో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. రెండు విల్లాల్లో దాదాపు 780 గ్రాముల బంగారు నగలు, 1.650 కిలోల వెండి వస్తువులు, రూ 4.5 లక్షల నగదు అపహరించుకెళ్లారు. ఈ వివరాలను ఆదివారం తిరుపతి క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. సీపీఆర్ విల్లాస్‌లోని 81వ నెంబరు ఎలక్ట్రానిక్ సంస్థలకు సలహాదారుగా పనిచేస్తున్న మేఘనాదన్ నివాసం ఉంటున్నారు. బంధువుల పెళ్లి ఉండటంతో బ్యాంకు లాకర్ నుంచి బంగారు నగలు, వెండి వస్తువులను శనివారం తీసుకొచ్చారు. మేఘనాదన్ దంపతులు మొదటి అంతస్తులో.. అతని అత్త, కుమారుడు రెండో అంతస్తులో పడుకున్నారు. లాకర్ నుంచి నగలు తెచ్చిన విషయాన్ని గమనించిన దుండగులు చోరీకి ప్లాన్ చేశారు. శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు ఐదారు మంది విల్లా వెనుక ఖాళీ స్థలం నుంచి ప్రహరీ సోలార్ ఫెన్సింగ్ కట్ చేశారు. మట్టి డంప్‌పైకి ఎక్కి గోడ దూకి లోపలకు వెళ్లారు. మొదట ఇద్దరు 81వ నెంబరు విల్లా వెనుక వైపున్న అల్యూమినియం డోర్ లాక్‌ను కట్ చేశారు. బెడ్‌రూములో భద్రపరచిన 735 గ్రాముల బంగారు నగలు, 1.650 కిలోల వెండి వస్తువులు, 800 యూఎస్ డాలర్లు, రూ.4.50 లక్షల నగదు అపహరించారు. ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేశారు. ముందుగానే హాలులో ఉన్న రెండు సీసీ కెమెరాలను పగలగొట్టారు. అయితే మేఘనాదన్ మొబైల్ నెంబరుకు నెట్ కనెక్టు అయి ఉండటంతో దొంగల ఫొటోలు అందులో నిక్షిప్తంగా పోలీసులకు కొంతవరకు ఆధారాలు దొరికాయి.

విల్లా నెంబరు 82లోనూ..

ఇక్కడి విల్లాస్‌లోని 82లో దొర ప్లాస్టిక్స్ అధినేత కేశవులు నాయుడు కుమారుడు జగదీష్ నివాసం ఉంటున్నారు. వీరి కుటుంబ సభ్యులు మొదటి అంతస్తులో పడుకుని ఉన్నారు. ఈ విల్లా వెనుక అల్యూమినియం డోర్‌లాక్‌ను స్క్రూ డ్రైవర్‌తో పగులకొట్టి లోపలకు ప్రవేశించారు. బెడ్‌రూములో భద్రపరచిన 45 గ్రాముల బంగారు నగలు, నాలుగు డైమండ్ లాకెట్లు, బ్లాక్ బీట్‌లు మూడు, చెవికమ్మలు ఒక జత అపహరించారు. ఇదే విల్లా నుంచి రెండు బ్యాగుల్లో వున్న మూడు కిలోల వెండి వస్తువులను ప్రహరీ బయట పడేసి వెళ్లారు. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకుని జగదీష్‌కు అప్పగించారు. అలాగే, వ్యాపారవేత్త శ్రీనివాసరావు, కాశీవిశ్వనాథ్‌కు చెందిన 78, 80 విల్లాల్లోనూ చోరీకి యత్నించారు. ఇక్కడ, కిటికీ స్లైడింగ్ తీసి సీసీ కెమెరాలు పక్కకు నెట్టి లోపలకు వెళ్లారు. కానీ, ఎటువంటి చోరీ జరగలేదు.. రెండు విల్లాల్లో చోరీపై బాధితులు తిరుపతి క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పోలీసుల పరిశీలన

తిరుపతి క్రైం, శాంతిభద్రతల ఏఎస్పీలు నాగభూషణరావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీలు శ్యాంసుందర్, నరసింగప్ప, సీఐలు చిన్నగోవిందు, శివకుమార్ రెడ్డి, తిరుచానూరు ఎస్ఐలు అరుణ, జగన్నాథ రెడ్డి, సాయినాథ చౌదరి, క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వేలిముద్రలు, దొంగలు ఎర్రమట్టి తొక్కి వచ్చిన పాద ముద్రలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఐదారు మంది ఈ చోరీలకు పాల్పడినట్లు తెలిసింది. ప్రతి ఇంట్లోకి ఇద్దరేసి వెళ్ళినట్లు పోలీసులు చెబుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎస్పీ హర్షవర్ధనరాజు ఘటనా స్థలానికి చేరుకుని చోరీలు ఎలా జరిగాయని ఆరా తీసారు. దొంగల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలన్నారు. క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడే తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
● క్యాంపుల నుంచి కార్పొరేటర్ల తిరుగుముఖం

తిరుపతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హైడ్రామాకు తెరలేపిన తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక క్లైమాక్స్‌కు చేరుకుంది. సోమవారం ఉదయం 11 గంటలకు ఎస్వీ విశ్వవిద్యాలయం సెనేట్ హాలులో ఎన్నిక జరగనుంది. డిప్యూటీ మేయర్ పదవి ఎవరిని వరిస్తోందనని సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. క్యాంపులకు వెళ్లిన కార్పొరేటర్ల చేతిలో డిప్యూటీ మేయర్ విజయం దాగుంది. వివిధ ప్రాంతాల్లో విడిది చేస్తున్న కార్పొరేటర్లు తిరుపతికి తిరుగుముఖం పట్టారు. 50 డివిజన్లు కలిగిన తిరుపతి కార్పొరేషన్లో వివిధ కారాణాల వలన 3 డివిజన్లకు కార్పొరేటర్లు లేరు. అంటే 47 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు ఓటు హక్కు వినియోగించుకుంటే ఆ సంఖ్య 50కు చేరుతుంది. ప్రస్తుతం కూటమి చెంత 24 మంది కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యుడైన ఎమ్మెల్యే ఓటు కలిపితే 25 ఉన్నాయి. వైసీపీ కార్పొరేటర్ ఒకరు అనారోగ్య కారణంగా రాలేకపోతున్నట్టు సమాచారం దీంతో వైసీపీకి ఎంపీ, ఎమ్మెల్సీ రెండు ఓట్లు కలుపుకొన్నా.. ఒక ఓటు ఆధిక్యతతో కూటమి అభ్యర్థి గెలుపొందుతారు. అదేకాకుండా వైసీపీ క్యాంపులో ఉండే కార్పొరేటర్లలో ముగ్గురు కూటమివైపు చేతులెత్తే సూచనలున్నాయి. వైసీపీ విప్ జారీ చేసిన నేపథ్యంలో ఎవరికీ చేతులెత్తకుండా మౌనంగా ఉండే కార్పొరేటర్లు కూడా లేకపోలేదన్న చర్చ జరుగుతోంది. ఇలాంటి ఉత్కంఠకు తెరపడాలంటే మరికొన్ని గంటలు వేచిచూడాల్సి వుంది.

పకడ్బందీ ఏర్పాట్లు

డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న జేసీ శుభంబన్సల్ ఆదివారం ఎస్వీయూ సెనేట్ హాలులో ఏర్పాట్లను పరిశీలించారు.

కుటుంబ కలహాలతో కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఎస్ఐ ప్రసాద్ వివరాల మేరకు.. అంబేడ్కర్ నగర్‌కు చెందిన కానిస్టేబుల్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్నారు. ఆయనకు భార్య గాయత్రి(37)తో గత కొంతకాలంగా ఆర్థిక లావాదేవీల కారణంగా తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు ఆదివారం ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేసిన అనంతరం భర్త గణేష్‌కు అప్పగించారు.

కృష్ణాపురం జలాశయాన్ని పరిశీలించిన ఈఈ



వెదురుకుప్పం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయాన్ని జలవనరుల శాఖ ఈఈ మురళీకృష్ణ ఆదివారం పరిశీలించారు. కృష్ణాపురం జలాశయం నుంచి ఎడమ కాలువ, కుడి కాలువ ద్వారా చెరువులకు నీరు ఏవిధంగా సరఫరా అవుతుందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కృష్ణాపురం జలాశయం చైర్మన్ అన్నామలై, ఏఈ భాస్కర్, రవిప్రకాష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పులిగుండుకు పర్యాటకుల తాకిడి



పులిగుండుపై పర్యాటకులు

పెనుమూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన పులిగుండుకు పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. సూర్యోదయాన్ని తిలకించేందుకు పర్యాటకులు ఉదయం 6 గంటలకే పెద్ద ఎత్తున పులిగుండు కొండపైకి చేరుకుంటున్నారు. ఈ కొండ భూమికి సుమారు వెయ్యి అడుగులు ఎత్తు ఉంటుంది. కొండపై నుంచి ఉదయం చుట్టూ మంచు దుప్పటిలా కప్పేసిన దృశ్యాలను పర్యాటకులు తిలకించి, ఫొటోలతో బంధిస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావడంతో వందల సంఖ్యలో పర్యాటకులు కొండపై కిటకిటలాడారు. సామాజిక మాధ్యమాల్లో పులిగుండు పాపులర్ కావడంతో పర్యాటకులు ఎగబడుతున్నారు.

కిక్కిరిసిన బోయకొండ గంగమ్మ ఆలయం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన బోయ కొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయంలో సందడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఏకాంబరం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. బోయకొండ గంగమ్మ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం అతి శీఘ్ర దర్శన టిక్కెట్లను ఈవో ఏకాంబరం, టీడీపీ మండలాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి ప్రారంభించారు.

టీడీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్సీ కంచర్ల, రాజ్‌కుమార్

కుప్పం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు భారీగా జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఆదివారం కుప్పం పురపాలక సంఘం ఐదో వార్డు తంబిగానిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన పది మంది యువకులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కుప్పం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మల్లేశ్వరకొండపై వెలసిన స్వయంభు మల్లేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి వేడుకలు మహా అద్భుతంగా నిర్వహించాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కావేటిగారి పల్లి పంచాయతీ మల్లేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆదివారం ఆయన ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న ఉత్సవాల విజయవంతానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయనాయుడు, చెంగల్రాయనాయుడు, ప్రసాద్‌రాయల్, గోపి నాయుడు, శివకుమార్, అరుణాచలంనాయుడు, కేశవులునాయుడు, గురు మూర్తి, ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

చిత్తడి నేలలు కాపాడుకోవాలి



మొక్కలు నాటుతున్న ఎఫ్ఆర్‌వో జయశంకర్ తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలను కాపాడుకోవాలని, వాటితో వాతావరణ సమతుల్యత రక్షింపబడుతుందని కుప్పం అటవీ శాఖాధికారి జయశంకర్ అన్నారు. నడిమూరు పంచాయతీ పరిధిలోని అటవీ శాఖ ఉద్యాన క్షేత్రంలో ఆ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం చిత్తడి నేలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమీపంలోని చెరువు వద్ద మొక్కలు నాటారు. రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, మాజీ సర్పంచి వళ్లెప్ప, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు పళని, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జ్యోతి, డీఆర్వో సమీర్‌బాషా, ఎఫ్‌బీవో రెహ్మాన్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకుడు గిరిధరగుప్తా తదితరులు

పలమనేరు, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సీపీఎం కార్యదర్శి గిరిధర గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం సీపీఎం కార్యాలయం ఎదుట కేంద్రబడ్జెట్‌పై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు నిరాశే మిగిల్చిందని.. రాష్ట్రానికి బడ్జెట్ మొండి చేయి చూపిందన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కనపెట్టిందన్నారు. జాతీయ విద్యాసంస్థలకు సైతం ప్రత్యేక కేటాయింపులు చేయలేదన్నారు. విశాఖ రైల్వేజోన్, ఎన్ఐటి, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐఎస్‌సీఆర్ గిరిజన యూనివర్సిటీ, దుగ్గిరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, ప్రత్యేకంగా వెనుకబడిన నిధులు, రాజధాని నిధుల ఊసే లేదన్నారు. గత బడ్జెట్‌లో రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించినా ఒక్కపైసా ఇవ్వలేదన్నారు. బడ్జెట్‌లో వాటి ఊసే లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజా, జయంతి, ధనమ్మ, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీపీఎస్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తదితరులు

పలమనేరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పరిరక్షణ సమితి(పీపీఎస్) 8వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక ఎన్జీవో హోం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. పీపీఎస్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. పీపీఎస్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యంపిళ్లై, పీపీఎస్ గౌరవ అధ్యక్షులు ఆనందబాబు పేర్కొన్నారు. అనంతరం వల్లూరి సరిత(భరత నాట్యం), బి.రజని(డాన్స్‌అకాడమి), వీరాధి విజయ్‌కుమార్ (యోగాగురువు), దేవేంద్రనాయుడు (కరాటే శిక్షకులు), ఎ.ఎస్ బాలాజి (భగవద్గీత బోధకులు), రిషబ్ ఓస్వాల్ పంత్ (ఆలిండియా సీఏ ఫస్టు ర్యాంకర్), ఎం.విజయ్‌కుమార్, విశ్రాంత ఉద్యోగి నాగప్పలకు ఉత్తమ సేవా పురస్కారాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అనాథ శవాల తరలింపు కోసం వాహనాన్ని సమకూర్చుకొనేందుకు పలువురు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీపురం సీతారామయ్య, గ్రామవార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు హరి, ఆకుల గజేంద్ర, సత్యప్రకాష్, జీలూబాయ్, ఎల్లంపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను కలిసిన సుహేల్‌బాషా



పుంగనూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను ఆదివారం విజయవాడలో పుంగనూరు టీడీపీ మైనార్టీ నేత సుహేల్‌బాషా కలిశారు. పుంగనూరులో అర్హత కలిగిన ప్రతి ముస్లిం, మైనారిటీలకు కార్పొరేషన్ నుంచి రుణాలు అందించి ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి సహకరించాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



కందూరు హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులతో గురువులు

సోమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందూరు హైస్కూల్‌లో 1989- 90 లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఒక్కటయ్యారు. గురువులను సన్మానించారు. నాటి తరగతి గదుల్లో తిరుగుతూ జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు గాంధీ విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అలాగే పూర్వ విద్యార్థి చింతలూరి సురేష్ విరాళంతో పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాట్లు చేపట్టారు. నాటి గురువులు రాయప్పరెడ్డి, పాపిరెడ్డి, విజయలక్ష్మీ, రెడ్డెప్ప నాయుడు, కుశలన్నలను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సురేశ్, విజయలక్ష్మి, జయప్రకాశ్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం నాయుడు, రెడ్డి కుమార్, అలీఖాన్ పర్యవేక్షించారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గంగవరంలో వెలసిన సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టి అలంకరించారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్‌వీ బాలాజీ, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంబాబు, మురళీ, గిరిధర్‌గోపాల్, నదీమ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈడిగ గౌడ్ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడిగా గిరిబాబు



ఎన్నిక పత్రాన్ని అందుకుంటున్న గిరిబాబు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈడిగ గౌడ్ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడిగా గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తిగౌడు తెలిపారు. ఆదివారం పలమనేరులో జరిగిన ఈడిగగౌడ్ సంఘ సభ్యుల సమావేశంలో ఎన్నికల్లో పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా గిరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు నాగరాజుగౌడ్, తుమ్మలరాధాకృష్ణాగౌడ్, మురళీగౌడ్, వంశీకృష్ణగౌడ్, ప్రభాకర్‌గౌడ్, చలపతిగౌడ్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకనెల్లూరు గ్రామంలో పుంగనూరు రాజేశ్వరి మెడికల్ స్టోర్ యజమాని సహకారంతో గ్రామ పరివర్తనసేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, కృష్ణయ్య, గిరిధర్ పాల్గొన్నారు.

55 మందికి నేత్ర పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు మురళీ

పలమనేరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు మురళీ 55 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఇందులో 35 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఆపరేషన్లు చేసుకొనే వారికి చెన్నై శంకర నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు.

సోమలకు 61 బీసీ కార్పొరేషన్ యూనిట్ల మంజూరు

సోమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలానికి 61 బీసీ కార్పొరేషన్ యూనిట్లు మంజూరు చేసినట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు. 50 శాతం సబ్సిడీ రుణాలను పొందేదుకు అర్హులైన బీసీ లబ్ధిదారులు ఫిబ్రవరి 7వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విరూపాక్షమ్మ ఆలయంలో పూజలు

సోమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గల్లావారిపల్లెలో నూతనంగా నిర్మించిన విరూపాక్షమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేరల్లో అమ్మవార్లకు పూజలు చేపట్టారు. అమ్మవారి మూల విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు గల్లా వరదరాజు, రెడ్డిశేఖర్ భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రేపు రథసప్తమి వేడుకలు

కల్లూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 11 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు చక్రస్నానం వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు.

మండల సచివాలయ నిర్మాణం పూర్తయ్యేనా..!

- అసంపూర్తి భవనాలే దర్శనం
- ఆరేళ్లుగా ముందుకు సాగని పనులు
- దుస్థితిలో ప్రస్తుత మండల పరిషత్ కార్యాలయం
- పెచ్చులూడుతున్న పైకప్పు
- అసౌకర్యాలతో అధికారులు, ప్రజల అవస్థలు
- ఇప్పటికైనా స్పందిస్తారని ఎదురుచూపు



అసంపూర్తిగా ఉన్న మండల సచివాలయ సముదాయం



అసంపూర్తి భవనంలో పశువును కట్టేసిన రైతులు

గుడుపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండల సచివాలయ సముదాయ భవనం గత ఆరేళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తోంది. మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి మండల పరిషత్ కార్యాలయం అద్దె భవనంలో ఉండేది. 1996 లో టీడీపీ ప్రభుత్వ హయాంలో మండల పరిషత్ కార్యాలయానికి కొత్త భవనాన్ని నిర్మించారు. రెవెన్యూ కార్యాలయం సైతం అద్దె భవనంలో ఉండటంతో ఒకే చోట రెండు కార్యాలయాలు ఉండాలని అప్పటి పాలకులు మండల పరిషత్ కార్యాల యంలోనే రెవెన్యూ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయ భవనంలోనే రెవెన్యూ కార్యాలయంతో గదులు సరిపడక కొన్ని సంవత్సరాలుగా అధికారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. భవనం నాణ్యతగా నిర్మించకపోవడంతో పైకప్పు పెచ్చులూడి నిత్యం పడుతుండేది. దీంతో 2015 లో అధికారులు, పాలకులు ప్రభుత్వానికి కొత్త భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు. స్పందించిన ప్రభుత్వం 2017లో గుడుపల్లె బస్‌స్టేషన్ వెనుక ఉన్న 1.5 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నూతన భవనం నిర్మించేందుకు రూ.1.5 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు ఉన్న నిధులతో స్లాబ్ వరకు పనులు చేశారు. ఆ తరువాత బిల్లులు విడుదల కాకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ భవనాన్ని పట్టించుకోలేదు. అప్పటి నుంచి భవనాన్ని స్థానికులు కొందరు పశువుల కొట్టంగా ఉపయోగిస్తున్నారు. మరి కొందరు రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షం వస్తే ఇప్పుడున్న మండల పరిషత్ కార్యాలయ భవనం గోడల నుంచి నీరు కారుతోంది. రికార్డులు పాడైపోతున్నాయని అధికారులు వాపోతున్నారు. కార్యాలయంలో గదుల కొరత ఉండటంతో సమావేశాల కోసం దూరంగా ఉన్న స్త్రీశక్తి భవనాన్ని వినియోగిస్తూ నిత్యం అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మండల సచివాలయ సముదాయ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులతో పాటు ప్రజలు కోరుతున్నారు.



ప్రస్తుతం దుస్థితిలో ఉన్న మండల పరిషత్ కార్యాలయం



పెచ్చులూడుతున్న కార్యాలయ పైకప్పు

కూటమి పాలనలోనే రాష్ట్రాభివృద్ధి

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

సోమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతోందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. సోమలలో ఆదివారం జరిగిన జనంలోకి జనసేన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఏపీ టిడ్కో చైర్మన్ వేముల పాటి అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పుంగనూరులో పెద్దిరెడ్డి ఆగడాలకు నిలువరించడానికి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఈ బహిరంగ సభ నిర్వహించడం జరిగిందన్నారు. తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసీపీ రాక్షసపాలన అంతం చేయడానికి టీడీపీ, బీజేపీతో జనసేన జత జట్టిందని చెప్పారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనతో ప్రపంచ దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఉమ్మడి జిల్లాల జనసేన అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ పుంగనూరులో జరుగుతున్న దోపిడీని అడ్డుకోవడానికి తొలి సభ ఇక్కడే నిర్వహించామని తెలిపారు. ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తేవాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సభలో నియోజక వర్గ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, పగడాల రమణ, నాగభూషణం రాయల్, చిన్నారాయల్, పవన్ రాయల్, కోలా సోమశేఖర్, మదనపల్లె రాందాసు చౌదరి, కిరణ్ రాయల్, పుంగనూరు బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు,దారం అనిత, రామకృష్ణా, కోలా రాజశేఖర్, డాక్టర్ హరినారాయణ, వినయ్ కుమార్, అభిషేక్, అనిల్, జాకీర్, ఛాను తదితరులు పాల్గొన్నారు. పుంగనూరు వైసీపీ నేత వేణుగోపాల్‌రెడ్డి అని.. జనసేనకు బుద్ధి చెప్పాలంటూ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పొరపాటున మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మదన్‌మోహన్ వేదికపై కనిపించారు. పెద్దిరెడ్డిపై నాగబాబు విమర్శలు చేసే సమయంలో సభికులు ఈలలు, కేకలు వేశారు.

సూరయ్యగారిపల్లె జనసేన నేతల నిరాశ

సోమల మండలం సూరయ్యగారిపల్లెలో జనసేన పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి నాగబాబు వెళ్లకపోవడంతో పార్టీశ్రేణుల్లో నిరాశ నెలకొంది. నెల రోజులుగా సూరయ్యగారిపల్లె జనసేన నేతలు మంగళగిరి వెళ్లి పవన్ కల్యాణ్, నాగబాబుతో మాట్లాడి జనసేన పతాక ఆవిష్కరణ ఆహ్వానించి పర్యటనను ఖరారు చేసుకున్నారు. అయితే నాగబాబు సోమలలో బహిరంగ సభ అయ్యాక సూరయ్యగారిపల్లెకు వెళ్లలేదు. దీంతో స్థానిక నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు.



నాగబాబుకు స్వాగతం పలుకుతున్న పుంగనూరు జనసేన నాయకులు

నాగబాబుకు ఘన స్వాగతం

పుంగనూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నేత నాగబాబుకు పుంగనూరు జనసేన నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. సోమలలో జరిగే సభకు వచ్చిన నాగబాబు పలమనేరు మీదుగా పుంగనూరు మండలం గుడిసిబండ సమీపంలోని టోల్‌గేట్ వద్ద భారీ స్థాయిలో స్వాగతం పలికారు. అనంతరం ద్విచక్రవాహనాలు, కార్లతో ర్యాలీగా యుఎన్ఆర్ సర్కిల్ మీదుగా చదళ్లలోని జనసేన పార్టీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లగా ఆయన స్వాగతం పలికారు. వేణుగోపాల్‌రెడ్డి ఇంట్లో భోజనం చేసి పుంగనూరు నియోజకవర్గంలో పార్టీ పటిష్ఠతపై దాదాపు గంటపాటు చర్చించారు. అనంతరం ర్యాలీగా సోమలకు బయలుదేరి వెళ్లారు. పుంగనూరు మండలం, పట్టణం నుంచి భారీస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సోమల సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, టిట్కో రాష్ట్ర చైర్మన్ అజయ్‌కుమార్, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, శివకుమార్‌రెడ్డి, పగడాల రమణ, చిన్నరాయల్, విరూపాక్షి, హరినాయక్, బాలాజీనాయక్, శ్రీనివాసులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లా ఐటా నూతన అధ్యక్షుడిగా సాబ్జుసాహెబ్



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా నూతన ఆల్ ఇండియా ఐడల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్.సాబ్జుసాహెబ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు షాహీన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేట క్రాస్‌లోని ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఎస్.సాబ్జుసాహెబ్, కార్యదర్శిగా అబ్దుల్ అలీమ్, ఉపాధ్యక్షులుగా అక్బర్‌హుస్సేన్, ఎండీ. హబీబుల్లాహ్, ఎస్.రహీమ్‌సాహెబ్, జాయింట్ కార్యదర్శులుగా ఎస్. గౌస్ బాషా, ఎస్. నసీంబాషా, ఎస్. జమీర్‌అబ్బాస్, మీడియా కార్యదర్శిగా రబ్బానీ, కోశాధికారిగా కె.ముబారక్‌బాషా, మహిళా కార్యదర్శిగా అఖ్తర్‌బేగం, గౌరవ అధ్యక్షులుగా రహమతుల్లాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

గోవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి



సీఎం చంద్రబాబును కలిసిన పుంగనూరు బీజేపీ నేత అయూబ్‌ఖాన్

పుంగనూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మీదుగా రోజూ లారీల్లో గోవులను కబేలాలకు తరలిస్తున్నారని.. అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడును బీజేపీ నేత అయూబ్‌ఖాన్ కోరారు. ఆదివారం సాయంత్రం ఢిల్లీ జనపత్‌లో సీఎం చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో బీజేపీకి మద్దతుగా తెలుగువారు ఉన్న ప్రాంతాల్లో చంద్రబాబు నిర్వహించిన ఎన్నికల ప్రచారాల్లో అయూబ్‌ఖాన్, మదనపల్లె టీడీపీ నేత బి.శ్రీరాములు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను మినహాయింపు సంతోషకరం

పలమనేరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్య ప్రజలు, పెన్షనర్లు, ఉద్యోగులకు మేలు చేసేలా వార్షిక ఆదాయం 12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపులు ఇవ్వడం సంతోషకరమని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వి.గురురాజారావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని సుమారు నాలుగు లక్షల మంది పెన్షనర్లలో 80 శాతం మందికి పన్ను టాక్స్ రద్దు చేకూరుతుందని తెలిపారు. కోట్లాది మంది మధ్యతరగతి వ్యాపారులకు ఆర్థిక బలం చేకూర్చే విధంగా నిర్ణయం తీసుకున్న దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

నేడు కడా పీడీ గ్రీవెన్స్ డే

కుప్పం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలో సోమవారం ఉయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తారు. నియోజకవర్గ ప్రజలు వివిధ సమస్యలపై సమర్పించే అర్జీలను పరిశీలించి ఆయా శాఖల ప్రభుత్వాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీ కోరారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గుడుపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, బ్రహ్మణ, కమ్మ, క్షత్రియ, కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన 21 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసు పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 7తేదీ లోపు ఆన్‌లైన్‌లో రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

కాళహస్తీశ్వరాలయంలో హోమం

వి.కోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గోనుమాకులపల్లెలో వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, నవగ్రహ హోమం, వేదపారాయణ చేశారు. పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఎన్. వెంకటేగౌడ, ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ డా.తమీంఖాన్, సర్పంచ్ బాలాజీ, అఖిలపోం నేతలు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు చల్లాకు ఆహ్వానం

రొంపిచెర్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కావేటిగారి పల్లెలోని మల్లేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం చల్లా రామచంద్రారెడ్డికి పత్రిక అందించి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రసాద్, అరుణాచలంనాయుడు, కేశవులనాయుడు, ధనంజయనాయుడు, రవి కుమార్‌నాయుడు, గోపినాయుడు పాల్గొన్నారు.

యువకుడికి ఆర్థికసాయం


బాధితుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న యువకుడికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రత్యేక చొరవతో సీఎం సహాయ నిధి నుంచి సాయం అందింది. కట్టమంచికి చెందిన చందు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. సర్జరీ నిమిత్తం లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ)ని ఎమ్మెల్యే ద్వారా సీఎం సహాయనిధి కార్యాలయానికి పంపారు. స్పందించిన సీఎంఆర్ఎఫ్ కార్యాలయం సీఎం సహాయ నిధి నుంచి రూ.6.62 లక్షల ఎల్‌వోసీ చెక్కును మంజూరు చేసింది. ఎమ్మెల్యే గురజాల తన స్వగృహంలో ఆదివారం బాధితుడికి చెక్కును పంపిణీ చేశారు. తన వైద్య అవసరాలకు సహాయం అందించిన సీఎం చంద్రబాబును, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను జీవితంలో మరిచిపోలేనని బాధితుడు చందు తెలిపారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు ఓ వరం



డయాలసిస్ కేంద్రం వద్ద ఎన్‌పీ జయప్రకాష్‌తో టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): డయాలసిస్ సెంటర్ ఏర్పాటు ఓ వరమని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ అన్నారు. గత యేడాది యువగళం పాదయాత్రలో భాగంగా బంగారుపాళ్యంకు వచ్చిన నారా లోకేష్‌ను స్థానిక నాయకులు కలిసి కిడ్నీ రోగుల కోసం మండలంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు 20సెప్టెంబర్ 2024న మండల సామాజిక ఆరోగ్య కేంద్రంలో అత్యాధునిక వసతులతో కూడిన డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి లోకేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఆదివారం ఎన్‌పీ జయప్రకాష్, టీడీపీ నాయకులు ఈ కేంద్రానికి చేరుకుని లోకేష్ పాదయాత్ర చేపట్టి ఒక సంవత్సరం పూర్తయి, బంగారుపాళ్యంలో ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు జనార్ధన్ గౌడ్, లోకనాథ నాయుడు, కమలనాథరెడ్డి, రమేష్, సూరి, గిరిబాబు, దేవయాని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ సన్మానం


దేవయ్యను సన్మానిస్తున్న గాజుల నాగేశ్వరరావు తదితరులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు దేవయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం హెచ్‌ఎం అరుణకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దేవయ్య సేవలను పలువురు కొనియాడారు. అనంతరం దేవయ్యను ఉపాధ్యాయ సంఘ నాయకులు, విద్యాశాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు శాలువలు కప్పి సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సాంబశివాచారి, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి అరగొండ హేమచంద్రారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి యువరాజు, జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి బోడె మోహన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిరణ్, పీఆర్‌టీయూ గురుమూర్తి, ఎస్టీయూ నాయకులు నాగేంద్రరాజు, ఆటుకారు చంద్ర, వెంకటేష్, గుర్రప్ప, సెల్వం, కార్తికేయులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే నిజమైన అభివృద్ధి అని... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్‌లో రూ.80 లక్షల విలువైన పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. నరిగపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామాల్లో పర్యటించినప్పుడు విద్యుత్ సమస్య తన దృష్టికి వచ్చిందని, దానిని పరిష్కరించినట్లు తెలిపారు. అనంతరం మేయర్ అముదతో కలిసి గోపాలపురంలో సిమెంటు కాలువ, నరిగపల్లె ఎస్టీకాలనీలో సిమెంటు కాలువ, అంగన్‌వాడీ భవనం, ఎస్సీ కాలనీలో సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం నరిగపల్లె వద్ద ఎన్‌పీఎల్ నైట్ క్రికెట్ మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే కాసేపు క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేతలు చంద్రప్రకాష్, వెంకటేష్ యాదవ్, రవి నాయుడు, గోపి, రాజా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి యువతే వెన్నెముక

గుడిపాల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీకి యువతే వెన్నెముకలాంటి వారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తెలుగు యువత నాయకుడు రాజేష్ పుట్టినరోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా యువతే ఎక్కువగా సభ్యత్వ నమోదు చేసుకుని ఇటు కూటమి ప్రభుత్వానికి, అటు యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్రంలో కోటి సభ్యత్వం చేసిన ఘనత యువతకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ నాయకులు ఆదాం బాషా, దొరబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు పలువురి శుభాకాంక్షలు

పూతలపట్టు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు నియోజకవర్గం ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి ప్రమోద్ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్, జనసేన నాయకుడు మహేష్‌లు కలిసి ప్రమోద్‌ను దుశ్శాలువతో సన్మానించి కేక్ కట్‌చేశారు. పూతలపట్టు నియోజకవర్గంలో టీడీపీ విజయానికి ప్రమోద్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్, ఐటీడీపీ అధ్యక్షుడు సొప్పా నాని, సతీష్, యువరాజ్, అజిత్, బాలు, శ్రీకాంత్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేని 8 ద్విచక్ర వాహనాల సీజ్


ద్విచక్ర వాహనాలను సీజ్ చేసిన సీఐ కత్తి శ్రీనివాసులు, సిబ్బంది

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాలమాకులపల్లె, ఇందిరానగర్ కాలనీల్లో శనివారం సీఐ కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లను తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం గ్రామసభ నిర్వహించిన సీఐ మాట్లాడుతూ ప్రజలు గొడవల జోలికి వెళ్లరాదని, సమస్యలు వస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. రోడ్డుప్రమాదాలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పత్రపల్లిలో కార్డన్‌సెర్చ్


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఈశ్వర్

యాదమరి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఎస్‌ఐ ఈశ్వర్ సిబ్బందితో కలిసి ఆదివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. వాహనాల రికార్డులు తనిఖీ చేసి, సైబర్ క్రైమ్ నేరాల నిరోధాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పత్రపల్లి, కుప్పూరు దళితవాడలో ఆదివారం ఉదయం ఎస్‌ఐ ఈశ్వర్, పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించి 65 వాహనాలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్ల రికార్డులు తనిఖీ చేసి, ఒక టూవీలర్‌కు సరైన డాక్యుమెంట్స్ లేనందున సీజ్ చేశారు. సైబర్ ఫ్రాడ్ జరిగితే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కనులపండువగా పుష్కర కుంభాభిషేకం


హోమం చేస్తున్న వేదపండితులు


యాదమరి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): యాదమరి మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం పుష్కర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం అయ్యప్ప స్వామికి 12 సంవత్సరాలకు ఒకసారి చేసే పవిత్రమైన పుష్కర అభిషేక కార్యక్రమాన్ని వేదపండితులు కనులపండువగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకం నిర్వహించి, కలశాలను ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు, యజ్ఞాలు చేసి హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా, ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నాగబాబు తీరుపై జనసేన నాయకుల అసంతృప్తి


సంక్రాంతిపల్లె వద్ద నాగబాబు కోసం ఎదురు చూస్తున్న జనసేన కార్యకర్తలు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు తీరుపై మండల జనసేన అధ్యక్షుడు కోడి చంద్రయ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా నాగబాబు తిరుపతి నుంచి పుంగనూరుకు రోడ్డు మార్గం ద్వారా వెళుతున్నట్లు తెలుసుకున్న జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంక్రాంతిపల్లె వద్ద ఆయనకు స్వాగతం పలికేందుకు తగు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయన రాక కోసం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచిచూశారు. అయితే నాగబాబు కాన్వాయ్ సంక్రాంతిపల్లెవద్ద ఆపకుండా వెళ్లిపోవడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిరాశతో వెనుదిరిగారు.

కార్మికులకు జీతాలు పెంచాలి


ఎస్ఆర్‌పురంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు జీతాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, గౌరవ అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఆర్‌పురం మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి మొదటి మహాసభను ఏఐటీయూసీ గ్రీన్ అంబాసిడర్ జిల్లా కార్యదర్శి గోవిందస్వామి అధ్యక్షతన నిర్వహించారు. అంతకు ముందు పుల్లూరు క్రాస్ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాధమ్మ, మంజుల, మల్లీశ్వరీ, రాధ, కోకిల, ఇంద్రాణి, తులసి, నిర్మల, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఒరూరు రోడ్డుకు మోక్షం


రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న టీడీపీ నాయకులు

విజయపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒరూరు వద్ద తిరుత్తణి - నాగలాపురం రోడ్డు దుస్థితికి చేరుకొని తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ విషయమై స్పందించిన అధికారులు ఆదివారం మరమ్మతు చర్యలు చేపట్టారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం రాజు, సాగునీటిసంఘ అధ్యక్షుడు గాలి రమేష్, తెలుగునాడు జిల్లాకార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, రమణయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దళిత సర్పంచ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

విజయపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతార్కాడు దళిత సర్పంచ్ బొబ్బిలిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా యువజన సంఘం మండల అధ్యక్షుడు సెల్వం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఆదివారం డిమాండ్ చేశారు. సర్పంచ్‌పై దాడి చేసి రెండు నెలలు కావస్తున్నా పట్టించుకోవడం లేదని, అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్లు బాగుచేయరూ...!

● రంగారెడ్డి వీధిలో గుంతల్లో పడి ఆస్పత్రుల పాలవుతున్న వాహనదారులు


రంగారెడ్డి వీధిలోని ర్యాంకర్స్ స్కూల్ ఎదురుగా మరమ్మతులకు గురైన రోడ్డు - అదే కాలనీలో మరో వీధిలో గుంతలు పడిన రోడ్డు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని మిట్టూరు రంగారెడ్డి వీధిలో రోడ్లన్నీ పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. ఈ కాలనీలో సుమారు 200పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. రోజు వందలాది మంది ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. రాత్రుల్లో ఈ గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడి ఆస్పత్రులపాలవుతున్నారు. ఆదివారం రాత్రి కూడా స్థానికుడు ఒకరు ఆ గుంతలో పడి గాయాలపాలయ్యాడు. 500 మీటర్ల ఉన్న ఈ రోడ్డులో 400 మీటర్ల పొడవునా రోడ్డు మరమ్మతుకు గురికావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు రెండో స్థానం కేటాయించడం ప్రశంసనీయం: టీడీపీ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంట్ స్థానంలో అమలవుతున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రెండో స్థానం కేటాయించడం ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్యే ఏ.ఎస్.మనోహర్ అన్నారు. ఆదివారం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పార్లమెంట్ స్థానం పరిధిలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా ప్రభుత్వ పథకాల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారనడానికి ఇది నిదర్శనమని అన్నారు. పార్లమెంట్ పరిధిలోని పూతలపట్టు, చిత్తూరు, గంగాధర నెల్లూరు, పలమనేరు, కుప్పం ఎమ్మెల్యేల పనితీరు కూడా బాగుందని, జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, రాంప్రసాద్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు సి.ఆర్.రాజన్, కోదండయాదవ్, కాజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దళిత సత్రం ఇప్పించేందుకు ఎమ్మెల్యే హామీ

● దేవదాయ శాఖ విశ్రాంత ఏడీసీ కేశవులు


కేశవులును సన్మానిస్తున్న దళిత మేధావులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో అధికారులతో చర్చించి దళిత సత్రాన్ని ఇప్పిస్తానని ఎమ్మెల్యే మురళీమోహన్ హామీ ఇచ్చారని దేవదాయ శాఖ విశ్రాంత ఏడీసీ జి.కేశవులు తెలిపారు. ఆదివారం అగరంపల్లె జడ్పీహైస్కూల్ క్రీడా మైదానంలో దళిత సభను కేశవులు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇరవై సంవత్సరాల క్రితం వరసిద్ధుడి ఆలయ అభివృద్ధి కోసం దళితులు తమ సత్రాన్ని అప్పగించినట్లు తెలిపారు. ఇరవై సంవత్సరాలుగా దళిత సత్రాన్ని ఆలయ అధికారుల నుంచి పొందడానికి పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికి ఎమ్మెల్యే స్పందించి తమకు న్యాయం చేస్తాననడం ఆనందంగా ఉందన్నారు. త్వరలో దళిత సత్రాన్ని ఆలయ అధికారుల వద్ద నుంచి పొందుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత మేధావులు పాల్గొన్నారు.

పెద్దబాలశిక్ష పుస్తకాల పంపిణీ


పెద్దబాలశిక్ష పుస్తకాలను పంపిణీ చేస్తున్న పైనేని మునెమ్మ కుమారులు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం ఆరిమాకులపల్లె గ్రామానికి చెందిన పైనేని మునెమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆదివారం జరిగిన ఉత్తరక్రియలకు హాజరైన వారందరికీ ఆమె జ్ఞాపకార్థంగా కుమారులు వినూత్నంగా పెద్దబాలశిక్ష పుస్తకాలను పంపిణీ చేశారు. పైనేని విజేంద్ర నాయుడు, పైనేని తులసీనాథ నాయుడు, పైనేని మురళి, పుష్ప, కాంతమ్మ పుస్తకాలు అందించారు.

టీడీపీ నాయకుడికి పలువురి నివాళి


నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురంకు చెందిన టీడీపీ నాయకుడు పెద్దబ్బవుండడి(67) అనారోగ్యంతో మృతి చెందారని స్థానికులు ఆదివారం తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాదిరాజు జనార్ధన్‌రాజు, టీడీపీ కార్వేటినగరం మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రవియాదవ్, నాయకులు జగన్నాథం, సోమశేఖర్‌యాదవ్, సంధాని, దాము, సోము, రుక్కుబాబు, సుమన్ అక్కడికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం


పొన్నియమ్మ గుడిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పొన్నియమ్మ గుడిలో ఆదివారం వసంత పంచమి సందర్భంగా ఆలయ నిర్వాహకులు, వీహెచ్‌పీ నాయకులు చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కేదారేశ్వరన్ సరస్వతి దేవికి పూజలు చేసి చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. విద్యార్థులకు వీహెచ్‌పీ నాయకులు పెన్నులు, నోట్‌బుక్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు వేలు, గోల్డ్ మల్లికార్జున్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వితరణ


కూరగాయల లారీని ప్రారంభిస్తున్న దాతలు

నగరి, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి ఆలయంలో ఆడిపురం శక్తిమాల పర్వదిన ఉత్సవాల సందర్భంగా నగరి, తిరుపతి, పుత్తూరు పరిసర ప్రాంతాల ఆదిపరాశక్తి భక్తులచే సుమారు 10 టన్నుల కూరగాయలను మేల్‌మరువత్తూరు సిద్ధులు పీఠానికి ఆదివారం నగరి ఓంశక్తి ఆలయం నుంచి తరలించారు. తిరుపతి ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ నుంచి దాతలు ఈ కూరగాయలను లారీలో నగరి ఓంశక్తి ఆలయం వద్దకు తీసుకొచ్చి అక్కడ నుంచి తమిళనాడుకు తరలించారు. ఓంశక్తి ఆధ్యాత్మిక కమిటీ జిల్లా అధ్యక్షులు గంగాధరం, తిరుపతి, నగరి, పుత్తూరు, కుప్పం ఆదిపరాశక్తి మందిర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

5న కలెక్టరేట్ ఎదుల ఫీజు పోరు : వైసీపీ

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసి పేద విద్యార్థులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, లలిత కుమారి అన్నారు. ఆదివారం వైసీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి స్వగృహంలో వారు మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 5న చిత్తూరు కలెక్టరేట్ వద్ద జరిగే ఫీజు పోరు కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కుంభాభిషేకం వేడుకల్లో ఎమ్మెల్యే


ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న వేదపండితులు

నగరి, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీలోని ఏకాంబరకుప్పం మాణిక్య వినాయకస్వామి ఆలయ కుంభాభిషేకం వేడుకల్లో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. గ్రామస్తులు, వేదపండితులు ఆయనకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. నగరి బైపాస్‌రోడ్డులో తాటిబెల్లం బేకరీని, టీ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ముడిపల్లిలో ఐటీడీపీ నాయకులు ధన ఓజీకుప్పంలో సీనియర్ టీడీపీ నాయకులు నారాయణ స్వామి నాయుడు గృహాల్లో జరిగిన కేశఖండన కార్యక్రమంలో పాల్గొన్నారు. అయనంబాకంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సురేష్ నాయుడు బంధువుల ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, రవి, గోవిందస్వామి, వేణు, శ్రీనివాసులురెడ్డి, జవహర్‌రెడ్డి, బాబు నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వీరజవాన్ కుటుంబానికి పరామర్శ


కార్తీక్ తల్లిదండ్రులతో రామచంద్రయాదవ్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం అసువులుబాసిన వీర జవాన్ పంగళ కార్తీక్ కుటుంబాన్ని బీసీవైపీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ ఎగువ రాగిమానుపెంటకు ఆదివారం చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్తీక్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కార్తీక్ తల్లిదండ్రులు, అన్న రాజేష్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. బీసీవైపీ నాయకులు రాధిక, ఓంప్రకాష్, గౌతమ్, కుమార్, మహేష్ పాల్గొన్నారు.

4న రథసప్తమి వేడుకలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ డి.ఎ.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రథసప్తమి సందర్భంగా స్వామి వారికి సూర్య ప్రభ వాహన సేవ నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కట్టమంచి వరదరాజ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి సూర్య, గరుడ, హనుమంత, శేష, తీర్థవారి, అశ్వ, పుణ్యకోటి, చంద్రప్రభ వాహన సేవలతో పాటు శ్రీవారి ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు అర్చకులు నారాయణ చక్రత్తార్ తెలిపారు.

రేపు వేపంజేరిలో వాహన సేవలు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 4వతేది మంగళవారం రథసప్తమి సందర్భంగా గంగాధరనెల్లూరు మండలం వేపంజేరిలో లక్ష్మీనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను ఏడు వాహనాలపై ఊరేగించనున్నట్లు ఆలయ ట్రస్టీ, న్యాయవాది కె.ఎస్.వాసు, మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి తెలిపారు. ఉదయం 8గంటలకు సూర్యప్రభ వాహనం, 10 గంటలకు శేషవాహనం, 11 గంటలకు హంసవాహనం, మధ్యాహ్నం 12 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 5గంటలకు అశ్వవాహనం, రాత్రి 6 గంటలకు గరుడవాహనం, 7గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తామని వారు చెప్పారు.

నైనేరమ్మకు ప్రత్యేక పూజలు


తులాభారం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భాస్కర్ కుటుంబీకులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం పాత డేరాకండ్రిగలో నైనేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన వసతి కల్పించారు. ఉభయదారులుగా సురేష్, జానకి దంపతులు వ్యవహరించారు. భాస్కర్, కుమారిల కుమారుడు నిహిత్‌సాయికి తులాభారంవేసి, మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త బి.ఆనంద్, సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

పార్టీ కోసం కష్టపడండి: పెద్దిరెడ్డి

గుడిపాల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శిగా వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్‌ను ఆ పార్టీ నియమించడంతో ఆదివారం ఆయన మాజీ మంత్రి పెద్దిరెడ్డిని తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి నుంచే మీరు పార్టీకి సేవలందించాలని సూచించారు.

పార్టీ సిద్ధాంతాలకనుగుణంగా పనిచేయాలి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పార్టీ సిద్ధాంతాలకనుగుణంగా పనిచేయాలని వైసీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమెను వెదురుకుప్పం ఎంపీటీసీ, పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రాధిక కలిశారు. తనకు తాజాగా పదవి రావడానికి కృషి చేసిన కృపాలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు బత్తల చిరంజీవిరెడ్డి, ఎంపీటీసీ తేకల మురళిరెడ్డి, నాయకులు పురందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఆటో యూనియన్ నూతన కార్యవర్గం


మోహన్, విజయ్‌కుమార్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా మోహన్, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్‌లు ఎన్నికైనట్లు యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగరాజు తెలిపారు. కోశాధికారిగా రఘు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వసంతరాయులు, ఉపాధ్యక్షులుగా సత్యమూర్తి, విజయ్‌చందర్, ఆదినారాయణ, 12 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు.